
మండి పోతోంది కడుపు. తరతరాలుగా వచ్చిన రోగమే అది. అలవాటే ఆనందరావుకు. బీద కుటుంబాల్లో ఆకలి గాకపోతే



ఏంబోతు తరుము కొస్తుందా మరి! అయినా కొన్నాళ్ళ నుంచీ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు— వాళ్ళ వంశస్థులిలా ఆకలి పాలవడానికి చేసిన పాపాలేమిటో, వాటికి ప్రాయశ్చిత్త మెల్లా చేయడమో – వగైరా... వగైరా...

ఆశలున్నా అందుబాటులో లేవు గనక, గొప్ప చదువులేమీ చదవలేకపోయాడతను. కానీ బ్రహ్మాండమైన పట్టుదలా, పైకి రావాలనే వుబలాటంతో తపించి పోతున్నాడీ మధ్య. తిమ్మిని బ్రహ్మి చేసి తీరాలి. "మనసుంటే మహేశ్వరుడైనా లొంగుతాడ"ని వాళ్ళమ్మ మెప్పుడూ అంటుంటే వింటూడేవాడు. తనలో మగ్గుతున్న ఆదర్శాలెన్నెన్నో! ఈ మాయదారి ప్రపంచాన్ని మంచి దోవకు తీసుకు రావాలని వువిళ్ళూరుతుంటాడు. నల్ల మార్కెట్టూ, నల్ల మందు నిషా– దోపిడీలూ, దొంగతనాలూ– హత్యలూ, అత్యాచారాలూ– వొకటొకటే సమాజాన్ని దిగమింగుతూ వెన్నంటుకొచ్చినప్పుడల్లా తనే గనక ముఖ్యమంత్రవుతే, యీ భ్రష్టుల్నందర్నీ గుంపులు గుంపులుగా నడిరోడ్డున వురి తీయించేవాడే కదా!

అయితే....

దరిద్రుడి కోపం దమ్మిడీ విలువ చేయదా యిరి! కనక ముందు తను కష్టపడి డబ్బు సంపాదించాలి.

# ఆక్షరి

## పట్వారి విజయరాఘవరావు



సొంత ఆకలినంతం చేస్తేనే ఇతరుల ఇక్కట్లను తర్కించుకోవచ్చు. దేనికైనా చేతిలో బలం కావాలి. బలముంటే బలగం తనెంతట తానే చేరుకుంటుంది, బెల్లం కోసం చీమల్లాగా!

విచిత్రమైన వుపాయం తట్టిం దానందరావుకు! ఈమధ్య గుంటూరులో ఎక్కడ చూసినా "మాజిక్ షో" లే! "ఇంద్రజాల మహేంద్రజాలం"తో జనం మీద జాలం వేసి జేబులు నింపుకుంటున్నారు తన పాత మిత్రుల్లు కొందరు. మాంత్రికులకు మంచి మంచి బిరుదులు కూడా లభిస్తున్నా యీ మధ్య. అందుకోసం అట్టే డిప్లొమాలూ, డిగ్రీలూ కూడా అవసరం లేదేమో.... ఎందుకో మహమోజు పడుతున్నాడల్లా చేసి చూడాలని! అవస్థపడి నేర్చుకుంటే నాలుగు రాళ్ళు సంపాయించడానికది మంత్ర దండంలా పని చెయ్యొచ్చు!

ప్రస్తుతానికదే రాజమార్గంలా కనిపించిందతనికి. ఇంకేం.... కాళ్ళకు బలపాలు కట్టుకుని కాని వూళ్ళన్నీ తిరుగుతూ, తనకు నచ్చిన గురువును సాధించాడొకనాడు! 'అంటే.... వరసాగ్గా వోనాల్గేళ్ళు వుస్తాద్ మహ్మమ్మద్ రషీద్ ఖాన్‌సాబ్ దగ్గర శిష్యత్వం చేశాడానందరావ్! కులమత భేదాల్లేకుండా గురువు గారు పెట్టింది తిని చెప్పింది చేసేవాడు. గారడీ గమ్మత్తులు చేస్తూ వూరురూ తిరుగుతూ, దార్నబోయే పిల్లల్నీ పెద్దల్నీ మంత్ర ముగ్ధుల్ని చేస్తూ, కష్మించినా, కాలం కమ్మగానే గడిచి పోతోందిప్పుడు. ఏమైనా సరే– తన సొంత తడాఖా జనానికి చూపించే రోజులు రాకపోతాయా మరి! ఘన మనోబలంతో, ధైర్యంతో, ఘుడియలూ, విఘుడియలూ మింగేస్తున్నా డానందరావు. తన ధేయాన్ని సాధించి తీరాలిక....

ఆ రోజూ వచ్చింది.

వుస్తాదుగారన్నారు "అబ్బాయ్! సెబాష్! నువ్వూ నా లాంటి శిష్యుల్ని దగ్గరకు తీసుకుని నేర్పి, నాపేరు నిలపాలోయ్! ఇన్నాళ్ళు నేర్పింది చాలు. ఇక నీ దారి నువ్వు చూసుకో. అప్పుడప్పుడు జ్ఞాపకముంటే గురువుగారికి, మంత్ర శుద్ధి కోసం నాల్గు రూకలు మణియార్డర్ జేస్తుండేం! అంటే. ఖుదాహాఫీజ్!"

ఆనందరావుకు దీపావళి పండుగలా వుందాక్షణం! తన కాళ్ళ మీద తాను నిలవగలిగాడు... గప్పున జంక్షన్‌లో నుంచిని గారడీ 'షో' చేస్తే, గుప్పున వర్షంలా కురుస్తున్నయ్– రూపాయలూ, అణాలూ!

"కష్మే ఫలే" అని వూర్కే అన్నారా మరి!!

★ ★ ★ ★ ★

బ్రహ్మాండమైన ఇల్లు. అసలా పేటలో ఇళ్ళన్నీబ్రహ్మాండంగానే వున్నాయి మరి శ్రీమంతుల ఇలాకా గనక. రాజకీయ వేత్తలూ, కంట్రాక్టర్లూ ఎగ్జిక్యూటివ్‌లూ, సంఘ సేవకులూ, మత గురువులూ, మంత్రుల స్నేహితులూ, హోదా వారీగా వీధులు పంచుకుని ఇళ్ళు కట్టుకున్న 'శాంతిపుర' మది! రోజూ రోడ్డుకో హత్య జరిగినా, వూళ్ళో పదింట వొకత్తైనా యువతి బలాత్కారం పాలైనా, మతం పేరుతో మందిర్‌లోనో, మసీదులోనో మనుషులు తలలు పగలగొట్టుకుంటున్నా, 'శాంతిపురం'లో శాంతి భద్రతలు మాత్రం బాగానే వున్నయంటూ పేపరు వాళ్ళు రాస్తూనే వున్నారు మరి! మంత్రుల మంచి తనముంటే మరేం కావాలి కనక!

తీరా 'శాంతిపురం' వాసి – వొకడో, ఆరో– నేరస్థుడని ఋజువైతే, మర్నాడు 'ఫొటో'తో సహా క్షమాపణలు కూడా అచ్చేస్తారు" తప్పు వారిది కాదనీ, తప్పుదాగిన మల్లయ్యదో, పుల్లయ్యదో ననీ"... హిందీలో వొక సామెత ప్రసిద్ధిలేండి.

"అమీర్ కీ బీబీ సబ్ కీ భాభీ– గరీబ్‌కీ బీబీ సబ్‌కీ జోరూ!" అంటే "ధనవంతుల ధర్మ పత్నులందరికీ వదినగార్లే! అయితే బీద వాళ్ళ భార్యలూళ్ళో వాళ్ళందరికీ గూడా పెళ్ళాలే!" ఇదీ లోకం పోకడ!

ఇంతకూ చెప్పొచ్చే దేమిటంటే 'శాంతిపురం'లో ఆ బ్రహ్మాండమైన యిల్లు పేరెన్నికైన కంట్రాక్టర్ పుణ్యమూర్తి గారిది. ఇపుడు వాళ్ళబ్బాయి వివాహ మహోత్సవం ధూమ్' 'ధామ్'గా జరగబోతోంది.

అసలు గమ్మత్తు మరొకటి!

ఈ పేటలో ధనవంతుల కుటుంబాల్లో పెళ్ళిళ్ళూ, పేరంటాలూ, మరే కథాకమా మిషీ జరిగినా "ఆనందరావ్ మాజిక్‌షో" వుండి తీరాల్సిందే ఈ మధ్య! రానురాను అదో ప్రిస్టేజీ వ్యాపారంలా తయారయింది! ఆనందరావదృష్టం చూసుకోండెలా తిరిగిందో! అతని కన్ని వేళ్ళూ నేతిలోనే మరి!

పుణ్యమూర్తి గారి పెద్దబ్బాయి పెళ్ళయితే మరి, మహేంద్ర జాలికుడు ఆనందరావ్ గారి "ఆల్ నైట్ షో" లేకుండా ఆ ఘనకార్య మెలా గట్టెక్కుతుంది చెప్పండి! పైగా పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ– ఇద్దరూ ఆనందరావ్ గారి ఫాన్‌లే యిప్పుడు!వాళ్ళాయన మాజిక్ షో లంటే చెవు కోసుకుంటారట!....

★ ★ ★ ★ ★

పెళ్ళి శోభనమై, మర్నాడు యువదంపతులు 'హనీమూన్'కు వెళ్తారను కుంటున్నారు. ఆ రోజు 'ఆనందరావ్ నైట్' కోసం ఏర్పాట్లన్నీ జరిగాయి. పొరుగూళ్ళో వరదల దృశ్యాలను విమానంలో దర్శించడానికి పోయిన ముఖ్యమంత్రిగారూ, గవర్నర్‌గారూ మినహాయించుకుని 'శాంతిపురం' శివార్లలో చెప్పుకోదగ్గ గొప్ప వాళ్ళంతా, పెళ్ళి వింత లయిన తర్వాత 'ఆనందరావ్ నైట్'కు హాజరయ్యారు. 'జాజ్' 'పాప్', 'రాక్', 'బీక్'– అన్నీ సరిగీతాలతో సహా 'ప్రేక్ష'కులను మంత్ర ముగ్ధులను చేస్తూ మొదలైంది మహేంద్రజాలం. ప్రేక్షకుల్లోంచి పెద్ద పెద్ద హేమా హేమీలను పేరెత్తి పిలిచి 'ట్రిక్కు' లను, పుంఖాను పుంఖాలుగా చకితులయ్యేట్టు స్వయం వాళ్ళ చేతుల్తోనే చేయిస్తున్నాడానంద రావ్! మంత్రి గారి మనవడి చేతిలో వంద రూపాయల నోటు బెట్టి "ఛూ మాయమంకాళీ" అనే సరికి దిడీల్మున మాయమైంది! మళ్ళీ "ఓపన్ ససేమ్" అనే సరికి తాసీల్దారుగారి కోడలు తాయారమ్మ పర్సు

లోంచి బయట పడిందా వంద రూపాయల నోటు!

కాఫీ హోటల్ గణపతి కళ్ళకు తువ్వాలడ్డం గట్టి, నోట్లోంచి వందలాదిగా ఇడ్లీలూ, దోశలూ, బోండాలూ, మైసూర్ పాకులూ కుంభవర్షం కురిపించాడు!

జనంలో హాహా కారాలూ?– గగ్గోలు!ఆనందబాష్పాలతో జై జై లూ! – ఎల్లాగైనా వర్ణించండి! – జనం మురిసి పోతున్నారు! డమరూ పుచ్చుకుని నాలుగు దరువులు గుండెలదిరేలా 'డమ' 'డమ' లాడిస్తూ ఆనందరావు తృటిలో గంభీర వదనంతో గొంతెత్తి అరిచాడు "ఇప్పుడు చూడండి నా తఢాఖా! ఆకలి కడుపు లల్లల్లారి పోతుంటే, యేమేం తింటాయో కళ్ళారా మీరే చూడండి పుణ్యాత్ము లారా!" అంటూ, ముందు బెట్టిన వొక వంద ఖాళీ గాజు గ్లాసుల్ని 'వుప్మా' లా వూదేశాడు!

అంతా చకితులై చూస్తున్నారు!

పుణ్యమూర్తి గారికి మాత్రం నవ్వొచ్చిందెందుకో! అనుమానం తీర్చుకోదల్చుకున్నాడు! తన కొడుకు పెళ్ళిలో తనేగా యీ 'షో' ఏర్పాటు చేసింది : ఆ "ఆర్గనైజర్" హోదాతో ఏదో వొకటి అడక్కపోతే, జనాని కెలా తెలుస్తుంది తన పెద్దరికం మరి!

"ఏమోయ్ ఆనందరావ్! వంద గ్లాసులు మింగేశావ్! ఇంకా అకలంటా వేంటోయ్?"

అంతా వెకిలిగా నవ్వారు!!

ఆకలంటే యీ రాక్షసులకేం తెలుసు?? తన పాత బీద తనంలో తన్ను ఆకలి పెట్టిన పాట్లన్నీ అద్దంలో మెరుస్తున్నట్టు తన కళ్ళ ముందుకొచ్చా యెందుకో!?

వొళ్ళు మండు కొచ్చింది....

ఈ సారి ఆకలితో కాదు.

అమితాగ్రహంతో!

తన తఢాఖా నిజంగా చూపించాలను కున్నాడానందరావ్!

"అయ్యా! ఆకలితో అలమటించి పోయే కోట్లాది దేశ వాసులకు గాజో, బూజో, తిండి సమయానికి కళ్ళ బడితే కబళించుకు మింగేయాలని పిస్తుంది... అయితే మరొక మనవి. తమ ఆజ్ఞ అయితే – ఆకలి లేకుండానే కొందరు ప్రజ్ఞులు యేమేం మింగేస్తుంటారో– అది కూడా చూపించ మంటారా?"

'షో' కైపులో ఆనందరావు మాటల్లోని అంతరార్థ మెవ్వరికీ తెలిసినట్టు లేదు!

అంతా వొళ్ళుసారిగా అరిచారు.

"ఆ. చూపించండి. చూద్దాం."

"అయితే, అయ్యా! సర్వశ్రీ పుల్లారేకుల పుణ్యమూర్తి గారూ, అయ్యా ధువ్వూరి దున్నేశ్వర్రావు గారూ, అయ్యా, మఠాచారి మహేశ్వరానందం గారూ– తమ ముగ్గురూ దయ చేసి నా దగ్గరగా జరగండి స్వామీ. .."

పుణ్యమూర్తి గారు పేరెన్నికైన ,,వర్ణ మెంటు కంట్రాక్టరని మీకు తెలుసుకదా! దున్నేశ్వర్రావ్ గారు ధువ్వూరి నుంచి ఎన్నికైన యం. యల్. ఏ. మఠాచారి గారు మహామహా భగవత్సాన్నిధ్యాన్ని సాధించిన మతగురువులు.

ఇలాంటి హేమా హేమీలను 'వాలంటీర్ల'గా పిలవ డంతో, ప్రేక్షకుల ఆదుర్దా పెరిగి పెరిగి గడియారంలా కొట్టుకుంటున్నాయి వాళ్ళ గుండెలు! మహదానంద కరమైన 'ఆనందరావ్ నైట్'లో ఏ అద్భుత మెలా ఘటిస్తుందో ఇప్పుడు! ముగ్గురు వి. ఐ. పి. లూ ముందుకు సాగుతుంటే కైపెక్కి జనం ఉక్కిరి బిక్కిరాడకుండా చూస్తున్నారు.

"జిగ్.... జిగ్... జిగ్... జిగ్... జిందాబాద్.... వుస్తాద్‌కీ జయ్‌హో! 'క్షూ' మాయమంకాళీ.... 'భమ్' 'భమ్' 'భమ్' 'భమ్' 'భమ్ భోలే....', అంటూ మేమిటో మంత్రోచ్చారణ చేస్తున్నాడానందరావ్!

ప్రేక్షకులు హటాత్తుగా హడలెత్తి పోయారా ముందు జరిగిన దృశ్యం చూస్తూ!!

వి. ఐ. పి. లు కక్కడం మొదలెట్టారు! పెద్దలనే పెద్ద మనుషులు జీవితాంతం తీరని ఆకలి తీర్చుకోడానికి జనం నెత్తిన చేతులు చాచి దొంగతనంగా మింగిన సామాగ్రంతా ఇన్నాళ్ళూ ఎలా దాచుకున్నారో....

మొన్న మొన్న కూలిపోయిన బెజవాడ బ్రిడ్జి సిమెంటంతా పుణ్యమూర్తి గారి కడుపులోంచి– జిగటలుగా ధారపోసుకుంది!

వోట్ల కోసం తను గొంతు కోసిన కోట్ల సుబ్బయ్య కళ్ళూ, కాళ్ళూ, చెవులూ, చేతులూ, దున్నేశ్వర్రావ్ గారి గొంతులోంచి దూసుకొస్తున్నాయ్!!

మతకలహాలు రేకెత్తించడానికి తనూ, తన శిష్యులూ కూడ బెట్టిన కత్తులూ, కటారులూ, చాకులూ, బాకులూ, మఠాచారి గారి మహాగరళం లోంచి కుంభ వృష్టి కురిశాయి!!!

మిగతా కథ మళ్ళీ రేపటి పేపర్లో తప్పకుండా చదవండి.

ఆశ్చర్యం కలగవచ్చు. అసహ్యం కలగవచ్చు. ఇలాంటి దుశ్చర్య లింకా తగ్గడమే లేదని మీకడుపులు మండుతాయి.

కానీ!!

కాలం గడుస్తూనే వుంటుంది.

'శాంతి పురం'లో శాంతి భద్రతల కేమీ లోటుండదు!

మంచి వాళ్ళకో మంచి పని చేయాలనీ, చెడ్డవాళ్ళకీ లోకాన్నే మింగేయాలనో ఆకలి!! – యీ 'ఆకలి' తీరేదికాదు!

ఎటూ "నా ఆకలి తీరేదెలా?" నంటారా? మరో కథ ఇలాంటిదే రాస్తాను.

ఎదురు చూడండి!!

